

వంగ సాగుతో.. బెంగ తీరంగ
'వంగ' సాగుతో.. అన్నదాత 'బెంగ' తీరుతోంది. ఆదాయాన్ని అందిస్తోంది. చీడపీడలు తట్టుకునేలా సరికొత్త వంగడాలు మార్కెట్లోకి అందుబాటులోకి వస్తున్నాయి. -8లో



ఆరడుగులు.. ఆమడదూరం
ఎర్రగుంట్ల మండలం మేకలబాలాయపల్లె గ్రామంలో శ్మశాన వాటిక లేదు. ఎవరైనా చనిపోతే మృతదేహాలను ఎక్కడ పూడ్చాలని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.390	రూ.500
రెండోరకం	రూ.280	రూ.370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 708 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

జాతీయ కబడ్డీ పోటీలకు రాయచోటి వాసి ఎంపిక



షేక్‌అలీ అహమ్మద్

రాయచోటి టౌన్: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాయచోటి పట్టణానికి చెందిన షేక్ ఆలీ అహమ్మద్ ఎంపిక య్యాడు. ఈ మేరకు శనివారం కబడ్డీ సంఘం నుంచి సమాచారం అందినట్లు షేక్ ఆలీ అహమ్మద్ తండ్రి షేక్ షబ్బీర్ తెలిపారు. యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కోచ్ నంద వెంకటేశ్వర గౌడ్ ఆధ్వర్యంలో ఈ పోటీలలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 13–14 తేదీలలో జమ్ము – కాశ్మీర్‌లో పోటీలు జరుగుతాయన్నారు.

15న శ్రీశ్రీపై కవితల పోటీ
కడప కల్చరల్: శ్రీశ్రీగా గుర్తింపు సాధించిన శ్రీరంగం శ్రీనివాసరావు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 15న కవితల పోటీ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సాహితీ స్రవంతి సామాజిక సాహిత్య సేవా సంస్థ జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామిలు తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కడపలోని ఆసక్తిగల యువతీ యువకులు పోటీలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరగనున్న శ్రీశ్రీ సాహిత్య సమాలోచన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. పూర్తి వివరాలకు లెనిన్ ప్రసాద్ 94906 60424. కుమారస్వామి 94901 22229 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సకాలంలో టీకాలు ఇప్పించండి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఆరోగ్య, వైద్యాధికారి కొండయ్య

ఓబులవారిపల్లె: తల్లులు తమ బిడ్డలకు సకాలంలో టీకాలు ఇప్పించాలని జిల్లా ఆరోగ్య వైద్యాధికారి కొండయ్య పేర్కొన్నారు. శనివారం మంగంపేట అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలు, గర్భిణులకు అందిస్తున్న టీకాలను పరిశీలించి మాట్లాడారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కాన్పు తర్వాత పిల్లలకు క్రమం తప్పకుండా వైద్యుల సూచనలు మేరకు అన్ని టీకాలు ఇప్పించాలన్నారు. వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి బుధ, శనివారాలు టీకాల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కవారిపల్లి ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టమాట.. ఉపాధి బాట

- మదనపల్లె టమాటా మార్కెట్‌కు విశేష ఖ్యాతి
- వందలాది మంది రైతులు, వ్యాపారులకు అండ
- ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్‌గా గుర్తింపు
- జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి సరుకు రాక
- తమిళనాడు, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతులు
- వందలాది కుటుంబాలకు ఆదరువుగా నిలుస్తున్న వైనం



మండీల వద్ద పనులు చేస్తున్న కూలీలు

మదనపల్లె సిటీ: మదనపల్లె వ్యవసాయ టమాటా మార్కెట్ ఆసియా ఖండంలోనే అతి పెద్దది. ఈ మార్కెట్‌పై ఆధారపడి వందలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. రైతులు పండించిన టమాటాను మార్కెట్‌కు తరలిస్తే అక్కడి నుంచి లారీలు, వాహనాల్లో పొరుగు రాష్ట్రాలకు తరలించడంలో కూలీలు కీలకపాత్ర పోషిస్తున్నారు. పడమటి ప్రాంతమైన మదనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, రామసముద్రం, నిమ్మనపల్లె, వాల్మీకిపురం, గుర్రంకొండ ప్రాంతాల్లో రైతులు అధికంగా టమాటా సాగు చేస్తారు. పండించిన టమాటాలను మదనపల్లె మార్కెట్‌కు తరలిస్తారు. మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌ను 1979లో అప్పటి మార్కెటింగ్ శాఖ మంత్రి వీరప్ప ప్రారంభించారు. అప్పటి నుంచి మార్కెట్ దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం 180 మందికిపైగా ట్రేడ్ లైసెన్సు, మండీ వ్యాపారులున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల నుంచే కాకుండా సీజన్‌లో అనంతపురం, వైఎస్సార్ జిల్లాతో పాటు సమీప రాష్ట్రమైన కర్ణాటకలోని రాయల్‌పాడు, శ్రీనివాసపురం, అడ్డగల్, లక్ష్మీపురం క్రాస్ నుంచి వేలాది మంది రైతులు టమాటాలను మార్కెట్‌కు తెస్తున్నారు. రోజుకు సగటున 150 టన్నుల నుంచి 200 టన్నుల వరకు కాయలు వస్తాయి. ఇక్కడి నుంచి తమిళనాడు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

మార్చి నెలాఖరు నుంచి సీజన్

మదనపల్లె మార్కెట్‌లో మార్చి నెలాఖరు నుంచి జులై వరకు సీజన్‌గా పరిగణిస్తారు. సాధారణ మాసాల్లో సగటున 150 టన్నుల నుంచి 200 టన్నులు మాత్రమే దిగుబడి వస్తుంది. సీజన్ ఉన్న మాసాల్లో 470 టన్నుల నుంచి 900 టన్నుల మించి రైతులు కాయలను తీసుకువస్తుంటారు. ఈ సమయంలో దేశంలోని ఏ రాష్ట్రంలో పంట సాగు చేయరు. కాబట్టి ఇక్కడి టమాటాకు డిమాండ్ ఉంటుంది. ఈ మార్కెట్‌లో వ్యాపారాలు విస్తరించడంతో జిల్లాలో వాల్మీకిపురం, ములకలచెరువు, కలికిరిలో మార్కెట్ కమిటీలు విస్తరించాయి. మదనపల్లె మార్కెట నుంచే ధరలు ప్రభావం చూపుతుంటాయి. ఇక్కడి నుంచి ముఖ్యంగా తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, హరియాణా, రాజస్థాన్ తదితర ప్రాంతాలతో పాటు కొన్నిసార్లు ఢిల్లీ నుంచి పాకిస్తాన్‌కు కూడా టమాటా ఎగుమతి చేసిన సందర్భాలు ఉన్నాయి.

ఎంతో మందికి ఉపాధి



గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలు

మార్కెట్ యార్డులో ఎంతో మందికి ఉపాధి లభిస్తోంది. కాయలను గ్రేడింగ్ చేయడం, వాటిని ట్రేలలో పేర్చి పేపర్‌తో ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి లారీల్లో లోడింగ్ చేస్తారు. దీంతో కాయలు దెబ్బతినకుండా అమ్మకాలు సులభంగా చేసుకోవచ్చు. ఈ పనులతో ఎక్కువ మంది మహిళలు లబ్ధి పొందుతున్నారు. సుమారు 600 మందికిపైగా కూలీలు పని చేస్తున్నారు. రోజు కూలీలు సగటున ఒక్కొక్కరు రూ.700–800 వరకు సంపాదిస్తున్నారు. దీంతో వారి కుటుంబ అవసరాలు తీరుతున్నాయి.

మార్కెట్ ఆదుకుంటోంది



మార్కెట్ నా కుటుంబాన్ని ఆదుకుంటోంది. 10 సంవత్సరాల నుంచి మార్కెట్‌లో పని చేస్తున్నాను. కాయలను గ్రేడింగ్ చేసి ట్రేలలో నింపుతాను. ప్రతి రోజు పని దొరుకుతుంది. కూలి డబ్బులు కూడా ఆ రోజే ఇస్తారు. ఇది మాకు ఎంతో ఆదరువుగా ఉంది.

–చిలకమ్మ, కూలీ, టమాటా మార్కెట్.మదనపల్లె

లోడింగ్ చేయడంతో ఉపాధి



క్రేట్‌లో నింపిన టమాటాలను లారీల్లో లోడింగ్ చేస్తాం. గత పదేళ్లుగా పని చేస్తున్నా. కాయలు దెబ్బతినకుండా లోడింగ్ చేస్తాం. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లినా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మార్కెట్ ద్వారా మాకు రోజు ఉపాధి దొరుకుతుంది.

–లక్ష్మినారాయణ, కూలీ, టమాటా మార్కెట్, మదనపల్లె

ప్రత్యేకంగా ప్యాకింగ్
టమాటాలను ఇతర ప్రాంతాలకు రవాణా చేసే విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కాయలు గ్రేడింగ్ చేసిన తరువాత దెబ్బతినకుండా ట్రేలపై పేపర్ ప్యాకింగ్ చేస్తాం. ఇలా చేయడం వల్ల కాయల నాణ్యత అలాగే ఉంటుంది. ప్యాకింగ్ పనులు గత 10 సంవత్సరాల నుంచి చేస్తున్నా. మార్కెట్‌లో నిత్యం పనులు ఉంటాయి.

–షాను, మహిళా కూలీ, టమాటా మార్కెట్, మదనపల్లె

18న బర్సీ మహోత్సవం
కమలాపురం: వైఎస్సార్ జిల్లా కమలాపురం పెద్ద దర్గాగా వెలుగొందుతున్న దర్గా–ఏ–గఫారియా, జహీరియా స్వర్గీయ పీఠాధిపతి హాజీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు పీఠాధిపతి నివాసం నుంచి గంధం ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామి వారి మజార్ పై ఎక్కిస్తామన్నారు. అలాగే ప్రత్యేక ఫాతెహా, పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.


తగ్గిన పచ్చి మిర్చి ధర



కడప అగ్రికల్చర్: రైతు బజారులో పచ్చిమిరప కాయల ఘాటు తగ్గింది. మొన్నటి వరకు కిలో రూ. 100 ఉన్న ధర శనివారం నాటికి కిలో రూ. 60కు చేరింది. అయితే టమాట ధర పెరిగింది. కిలో రూ. 25 ఉన్న టమాట ధర ఒక్కసారిగా పెరిగి రూ. 50కు చేరింది. అలాగే బీన్స్ కిలో రూ. 110, కాప్సికం కిలో 80, అల్లం కిలో 180 పలుకుతున్నాయి. ఈధరలు సామాన్యులకు భారంగా మారాయి.

నిత్యాన్నదానానికి విరాళం
చక్రాయపేట: గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రు.3,00,116లు విరాళంగా వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. బెంగళూరుకు చెందిన చదిపిరాళ్ల సతీష్ కుమార్‌రెడ్డి, మాధవీలత దంపతులు, వారి కుమార్తె మానసిరెడ్డిలు చక్రాయపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులోని ఆలయ ఖాతాకు సదరు మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా జమ చేశారని చెప్పారు. ఈమేరకు రశీదును కూడా పంపినట్లు ఆయన వివరించారు. ఈసందర్భంగా వారి కుటుంబసభ్యులందరి పేరుమీద స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించినట్లు తెలిపారు.

అంబరం..అబ్బురం



వెండి వెన్నెలలా మెరుస్తున్న మేఘాలు

ఆకాశంలో అద్భుత దృశ్యం కనువిందు చేసింది. శనివారం సాయంత్రం ఆకాశం తెల్లని మేఘాలతో నిండిపోయింది. వెండి వాకిలి పరచుకుందా అన్న చందంగా చూపరులను ఆకట్టుకుంది.అబ్బురపరిచింది. ఈ దృశ్యాన్ని సాక్షి క్లిక్ మనిపించింది.

– కడప అగ్రికల్చర్

కరుణించిన వరుణుడు

- ముంగారు వర్షాలతో ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమంటున్న రైతులు
- జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు



పెన్నానదికి చేరిన వరదనీరు

రాయచోటి/బి.కొత్తకోట: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కురుస్తున్న ముంగారు వర్షాలు జిల్లా రైతాంగాన్ని పులకించేలా చేస్తున్నాయి. సీజన్ ప్రారంభ దశలో వచ్చే మృగశిర కార్తిలోనే పంటల సాగుకు అనుకూలంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతు పవనాల ప్రభావంతో మూడురోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ఎండిపోయిన బీడు భూముల్లో తేమ శాతం పెరిగింది. దీంతో భారీలోతు దుక్కులకు అనుకూలంగా మారాయి. ఈనెల 2వ తేదీన కురిసిన వర్షాలతో అనేక మంది రైతులు వర్షాధార పంటల సాగుకోసం దుక్కులు చేసుకున్నారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వరిసాగుపై కూడా దృష్టి సారించారు. జిల్లాలో ప్రధానంగా సాగు చేసిన వేరుశనగ, టమాటా, ఇతర కూరగాయల పంటలతో పాటు కుంటలు చెరువుల్లోకి నీరు చేరితే అధికంగా వరి పంటను కూడా సాగు చేయనున్నారు. శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షాలకు అనేక పంటలు దెబ్బతిని రైతులకు ఆర్థికంగా ఇబ్బందులను కలిగిస్తున్నాయి. వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఒకవైపు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి నష్టం అంచనాలు వేస్తున్నారు. మరోవైపు రైతులు వేరుశనగ, వరి రకాల విత్తనాల కొనుగోలులో మునిగిపోయారు.

శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా నమోదైన వర్షపాతం వివరాలు

గాలివీడు 13.2 మిల్లీ మీటర్లు, చిన్నమండెం 3.8, సంబేపల్లె 21.0, టి సుండుపల్లె 34.8, రాయచోటి 20.8, లక్కిరెడ్డిపల్లి 11.2, రామాపురం 6.4, వీరబల్లి 14.6 , నందలూరు 18.2 మిల్లీ మీటర్లు నమోదైంది. అలాగే పెనగలూరు 4.2 మిల్లీ మీటర్లు, చిట్వేలి 16.4, రాజంపేట 31.0, పుల్లంపేట 35.6, ఓబులవారిపల్లె 22.2, కోడూరు 24.4,ములకల చెరువు 13.2, తంబళ్లపల్లి 6.0 మిల్లీ మీటర్లు, పెద్దమండ్యం 16.4 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. గుర్రంకొండ 24.4 మిల్లీ మీటర్లు, కలకడ 24.6, కేవీపల్లి 45.6, పీలేరు 6.0, కలికిరి 23.0, వాల్మీకిపురం 26.2, కురబలకోట 2.0, పెద్దతిప్పసముద్రం 30.0, బికొత్తపేట 5.2, మదనపల్లి 19.2, నిమ్మనపల్లి 3.8, రామసముద్రం 3.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

పెన్నానదికి జలకళ


సిద్దవటం: సిద్దవటంలోని పెన్నా నదీ పరివాహ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శనివారం తెల్లవారుజామునుంచి పెన్నా నదికి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో పెన్నా పరివాహక ప్రాంతాల రైతులకు చెందిన వ్యవసాయ బోర్లలో నీరు లేక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వర్షాలు కురవడం, పెన్నాకి వరద నీరు వచ్చి చేరడంతో ఇక పంటలు సాగు చేసుకోవచ్చునని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి నేలకొరిగిన అరటి

పుల్లంపేట: రైతు ఆరుగాలం కష్టపడి పండించే పంటకు ఒకవైపు ధరలు లేక లబోదిబోమంటుంటే ఇటీవలి వర్షాల దెబ్బకు రైతులు కుదేలైపోతున్నారు. పుల్లంపేట మండల పరిధిలోని ఎగువరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి వీచిన గాలులకు ఈశ్వరయ్య, ఆలం చిన్న చెంగయ్య, రమణయ్యకు చెందిన 20వేల అరటి చెట్లు నేలకొరిగాయి. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రసూబేబీ.. నటనే హాబీ!

- 'సోషల్ మీడియా' సూపర్‌స్టార్ ప్రశాంత్
- 'ప్రసూ బేబీ'గా యూట్యూబ్‌లో సంచలనం
- 8.5 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు
- ఇన్‌స్ట్రాగామ్‌ను సైతం షేక్ చేసిన వైనం
- మదనపల్లె విద్యార్థి విజయగాథ





మదనపల్లె సిటీ: అవును అతడు సోషల్ మీడియా సూపర్‌స్టార్. యూట్యూబ్‌లో 8.5 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు, ఇన్‌స్ట్రాగామ్‌లో భారీ ఫాలోయింగ్. ప్రసూబేబిగా సూపర్ ఫేమస్. చదివింది ఎంటెక్. ప్రయత్నిస్తే సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత ఉద్యోగం వస్తుంది. లక్షలాది రూపాయల జీతం లభిస్తుంది. కానీ అతను అందరూ వెళ్లేదారిలో కాకుండా తనకంటూ ప్రత్యేక మార్గం ఉండాలని భావించాడు. నిండు చందురుడు ఒకవైపు–చుక్కలు ఒకవైపు' అని భావించే తత్వం ఆయనది. అందుకే అతను సోషల్ మీడియాను వేదికగా ఎంచుకున్నాడు. ఆ మార్గంలో వెళ్లే క్రమంలో మొదట అందరూ హేళన చేశారు. అయినా నిరుత్సాహపడలేదు. మరింత కసి, పట్టుదలతో ముందుకెళ్లాడు. ఎంచుకున్న రంగం ఏదైనా సరే, పట్టుదల, చిత్తశుద్ధి ఉంటే విజయం తనవెంటే ఉంటుందని నిరూపించాడు. ఇంటిల్లిపాదీ ఆనందించే వీడియోలను సొంతంగా రూపొందిస్తూ అందులో తానే నటిస్తూ సోషల్ మీడియా సూపర్‌స్టార్‌గా ఎదిగాడు. అతనే మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె(గారబురుజు)కు చెందిన ప్రశాంత్. అతని విజయగాథపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎంతో మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారు. తమకున్న నైపుణ్యాలు ప్రదర్శిస్తూ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అలాంటివారిలో ప్రశాంత్ ఒకరు. ప్రసూ బేబి అనే యూట్యూబ్ ఛానల్ పేరుతో తల్లిదండ్రుల నుంచి ప్రేమికుల వరకు వారి బాధ్యత గుర్తు చేస్తున్నాడు. సరదా సరదా వీడియోలతో యువతను ఆకట్టుకుంటున్నాడు. ఎలాంటి సినీ నేపథ్యమూ లేకపోయినా నటనతో సత్తా చాటుతూ అనతికాలంలోనే సోషల్ మీడియా సూపర్‌స్టార్‌గా ఎదిగాడు. పొడవాటి జుట్టు, గడ్డంతో స్టైలిష్‌గా కన్పించే ప్రశాంత్ చక్కటి నటన, వైవిధ్యమైన డైలాగ్ డెలివరీతో అందరినీ అలరిస్తున్నాడు. ప్రశాంత్ అంటే ఎవరూ గుర్తు పట్టరు. కానీ 'ప్రసూబేబి' అంటే మాత్రం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు ఇట్టే గుర్తు పట్టేస్తారు.

టిక్‌టాక్‌తో మొదలు పెట్టి..
మదనపల్లెలో ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతుండగానే నటనపై ఆసక్తితో 2019లో టిక్‌టాక్‌లో లిప్–సింక్ వీడియోలను చేయడం ప్రారంభించాడు. ప్రేమ, మానవత్వం, కుటుంబ ఇతివృత్తంగా వీడియోలు రూపొందించాడు. అవి బాగా ట్రెండింగ్ కావడంతో లక్షల్లో సబ్ స్క్రైబర్లు వచ్చారు. కేంద్ర ప్రభుత్వం టిక్‌టాక్‌పై నిషేధం విధించడంతో తన దృష్టిని యూట్యూబ్‌పై మళ్లించాడు.

అనంతపురం కేంద్రంగా...

ప్రశాంత్ ఎంటెక్ చదివేందుకు అనంతపురం జేఎన్‌టీయూలో చేరాడు. చదువుకుంటూనే సీరియస్ యాక్టింగ్ మొదలుపెట్టాడు. నటనపై ఆసక్తి ఉన్న తనలాంటి వారితో కలిసి వీడియోలు రూపొందిస్తున్నాడు. యాక్టింగ్ మొదలుకుని స్క్రిప్ట్ వరకు అన్నీ తానే చూసుకుంటున్నాడు. ఇప్పటి వరకు 30 మందికిపైగా తనతో కలిసి నటించారు. వారిలో చాలామందికి సొంత యూట్యూబ్ చానళ్లు, ఇన్‌స్టాగామ్ అకౌంట్లు ఏర్పాటు చేయించి వారూ తగిన ఆదాయం పొందేలా చూస్తున్నాడు. సోషల్ మీడియాలో ప్రశాంత్ పాపులారిటీ గుర్తించిన పెద్ద సంస్థలు సైతం అతనితో వ్యాపార ప్రకటనలు చేయిస్తున్నారు. సినిమా ప్రమోషన్లు కూడా చేయిస్తున్నారు. ఇటీవలే దసరా, విరూపాక్ష సినిమాలకు ప్రమోషన్ చేశారు. ఓటీటీ, సినిమా ఆఫర్లు సైతం వస్తున్నాయి.



తల్లిదండ్రులతో కలిసి యూట్యూబ్ నుంచి వచ్చిన సిల్వర్, గోల్డన్ ప్లే బటన్స్ చూపుతున్న ప్రశాంత్

వ్యవసాయ కుటుంబం నుంచి..

ప్రశాంత్‌ది వ్యవసాయ కుటుంబం. మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండలం గారబురుజు గ్రామం. తల్లిదండ్రులు సావిత్రి, నారాయణ. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇద్దరు కుమారులు కాగా, ప్రశాంత్ చిన్న కుమారుడు. ప్రాథమిక విద్య గ్రామంలో చదివాడు. ఇంటర్మీడియట్ వాల్మీకిపురం జూనియర్ కాలేజీలో, బీటెక్ మదనపల్లె ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో చదివాడు.

పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రయత్నంతోనే...
పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రయత్నంతోనే నేను ఎంచుకున్న గమ్యాన్ని చేరుకోగలిగాను. సాధించాలన్న బలమైన కోరిక, దానినితోడు సరైన ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళితే మనం తప్పకుండా విజయం సాధిస్తాం. నిత్య జీవితంలో జరిగే సంఘటనలు, కుటుంబంలో ఉండే సంతోషాలు, సరదాలు, సమస్యలే ఇతివృత్తంగా ఎక్కువ వీడియోలు రూపొందించా. ఇవి భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా అందరికి కనెక్ట్ అయ్యాయి. ఇదే ఉత్సాహంతో మరింత మంచి కంటెంట్ అందివ్వడానికి ప్రణాళికలు సిద్ధ చేసుకుంటున్నా. వెబ్ సీరిస్‌లపై ప్రత్యేక దృష్టి పెడుతున్నా.

–ప్రశాంత్ (ప్రసూబేబీ)

క్లుప్తంగా

జింకా విజయలక్ష్మి రాజీనామా



ప్రొద్దుటూరు : ఆంధ్ర ప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాజీనామా లేఖ పంపారు. యథావిధిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ పురోభి వృద్ధికి చేస్తానని ఆమె తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయ కమిటీ సభ్యుల రాజీనామా



విజయ(ఫైల్)

రాయచోటి టౌన్ : రాయచోటి వీరభద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు రాజీనామా చేసినట్లు ఆలయ ఈవో డి.వి.రమణారెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయతోపాటు కమిటీ సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, ఆర్.నరసింహులు, బి.జయభాస్కర్, ఎం.విజయ, యం.లక్ష్మి, డి.భారతమ్మ, బి.నాగభూషణం, కె.సురేష్‌కుమార్ మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు తెలిపారు. వీరి రాజీనామాలను దేవాదాయ, ధర్మాదాయశాఖకు పంపినట్లు తెలిపారు. పోలంరెడ్డి విజయ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సహకారంతో 92 భవనాల నిర్మాణం (దాతల సహకారంతో) చేపట్టారు. ఆలయంలో నిత్యాన్నదానంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

ఘాట్‌లో ప్రమాదం

చింతకొమ్మదిన్నె : కడప రాయచోటి ప్రధాన రహదారిలో గువ్వల చెరువు ఘాట్ వద్ద శనివారం బస్సు–లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారరు. హైదరాబాద్ నుండి చిత్తూరుకు వెళుతున్న బస్సును రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వంగ సాగుతో.. బెంగ తీరంగ

- నాలుగునెలల తరువాత పుంజుకొన్న ధరలు
- మార్కెట్లో కిలో వంగ ధర రూ.40
- కర్నాటక, తమిళనాడుల్లో మంచి డిమాండ్
- వంగ సాగుతో లాభాల బాటలో రైతులు

'వంగ' సాగుతో.. అన్నదాత 'బెంగ' తీరుతున్నది. కూరగాయల్లో రారాజుగా వెలుగొందే వంకాయ.. తనను పండించే రైతు కష్టాలు తీరుస్తున్నంది. అన్నదాతకు ఆదాయాన్ని అందిస్తోంది. చీడపీడలు తట్టుకునేలా సరికొత్త వంగడాలు మార్కెట్లోకి వస్తుండగా, రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతోంది. నాలుగు నెలల తరువాత మార్కెట్లో ధరలు పుంజుకోవడంతో మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో డిమాండ్ పెరిగింది.



దాదంవారిపల్లెలో సాగు చేసిన వంగతోటలు



రవాణాకు సిద్ధంగా ఉంచిన వంకాయలు

గుర్రంకొండ : జిల్లాలో ఈ సీజన్‌లో 1650 హెక్టార్లలో వంగ తోటల సాగు చేశారు. సుమారు నాలుగు నెలల తరువాత మార్కెట్లో వంగ ధరలు పెరగడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నాలుగు నెలల కిందట ధర పతనమవడంతో కొందరు తోటలు దున్నేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో వంగ తోటలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోవడంతో ఇపుడు జిల్లాలో పండించే వంగకు మార్కెట్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. ఓవైపు దిగుబడి లేక పోవడంతో మరోవైపు అధిక ఎండలు, వర్షాలు ప్రారంభం కావడంతో ఈ నెలలో వంగ ధరలు ఒక్కసారిగా పుంజుకొన్నాయి.

ఎకరాకు రూ.4.80 లక్షల ఆదాయం

ఎకరం పొలంలో వంగ సాగుకు దుక్కుల నుంచి కాయలు కోతకు వచ్చేంత వరకు రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. చెట్టు ఎదుగుదల, పూత పిందె నిలవడానికి, చెట్టుకు సత్తువ ఇచ్చి కాయలు ఎక్కువ కాయడానికి వారాకోసారి మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. ప్రతి వారం ఇందు కోసం సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేలు ఖర్చవుతుంది. మొక్కలు నాటిన 90 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. మంచి దిగుబడి వస్తే కనీసం రూ.4 లక్షల నుంచి గరిష్టంగా రూ.4.80 లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. ఈ ఏడాది మార్కెట్‌లో మొదటి రకం కిలో వంగ ధర మొదటి రకం రూ. 40, రెండో రకం రూ.32, మూడో రకం రూ.28 పలుకుతోంది. ఈ లెక్కన రైతుకు ఎకరాకు మంచి ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు.

దిగుబడి తగ్గినా.. ధరలు ఆశాజనకం

జిల్లాలో వంగ సాగు దిగుబడి రోజురోజుకూ తగ్గిపోతున్నా ధరలు పుంజుకొన్నాయి. ముఖ్యంగా పడమటి మండలాల్లో ఎక్కువగా వంగ సాగు చేపట్టారు. రెండు నెలలుగా వాతావరణంలో సంభవించిన మార్పులతో తోటలు దెబ్బ తిన్నాయి. అధిక ఎండల ప్రభావంతో పూత పిందె రాలిపోయి మరో వైపు రోగాల బెడద ఎక్కువైంది. దీంతో దిగుబడి ఆశించినంత మేర రాకపోగా అకాల వర్షాలకు వంగతోటలు కొంత దెబ్బతిన్నాయి. దీంతో ఒక్కసారిగా మార్కెట్లో డిమాండ్ ఏర్పడి ధరలు పుంజుకొన్నాయి. పదిహేను రోజుల కిందట మార్కెట్లో కిలో వంగ ధర రూ.70 నుంచి రూ.80 పలికింది. ప్రస్తుతం కిలో రూ.40 వరకు ధరలున్నాయి.

బెంగుళూరు, చెన్నైలో మంచి డిమాండ్

జిల్లాలో సాగు చేసే వంకాయలకు బెంగుళూరు, చెన్నైలో మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా మద్రాసు రకం వంకాయలకు అక్కడి మార్కెట్లో మంచి ధర ఉంది. ఇక్కడ సాగు చేసే వంకాయలను తిరుపతి, కడప, చెన్నై, బెంగుళూరు మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో బయట రాష్ట్రాల వ్యాపారులే తోటల వద్దకు వచ్చి కాయల్ని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ప్రస్తుతం కోత కూలీ, రవాణా ఖర్చులు, పెట్టుబడి సాగు ఖర్చులు పోనూ రైతులు లాభాలు చవిచూస్తున్నారు.

వంకాయ సాగుతో కొంత లాభం



ప్రస్తుతం ఇతర కూరగాయల పంటలతో పోలిస్తే వంగ తోటల సాగు లాభసాటిగా ఉంది. టమాటాతో పోల్చుకొంటే ఇరవై రోజులుగా మార్కెట్లో వంగ ధరలు నిలకడగా ఉన్నాయి. ఇవే ధరలుంటే కష్టాలు తీరే అవకాశం ఉంది. మంచి లాభాలు చూడడంతోపాటు ఎకరాకు అన్ని ఖర్చులు పోనూ రూ.4 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

– రాజమ్మ, కొత్తపల్లె

రెండు ఎకరాల్లో సాగు చేశాను



రెండెకరాల పొలంలో వంగతోట సాగు చేశాను. మద్రాసు రకం వంగ సాగు చేయడంతో మార్కెట్లో ధరలు బాగానే ఉన్నాయి. టమాటాతో పాటు రైతులకు వంగ సాగు కలిసి వస్తోంది. మార్కెట్లో కొద్ది రోజులుగా ధరలు నిలకడగా ఉన్నాయి. ధరలు ఇలాగే ఉంటే రైతులు కష్టాలు తీరుతాయి.

– నరసింహులు, రైతు, మొరవపల్లె

వివాహిత అదృశ్యం



షేక్ కరిష్మా అలియాస్ సఫూర్ బేగం (ఫైల్)

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ వలీ బాషు తెలిపారు. పట్టణంలోని ఎన్వీఆర్ లే అవుట్‌కు చెందిన రషీద్ అన్సారీ భార్య షేక్ కరిష్మా అలియాస్ సఫూర్ బేగం (35), నెల రోజుల కిందట సూపర్ మార్కెట్‌కు వెళ్లింది. తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు నెల రోజులుగా పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త రషీద్ అన్సారి శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేనేత కార్మికుడి ఇంట్లో చోరీ

– రూ.3.5 లక్షల విలువైన 70 గ్రాముల బంగారం అపహరణ

మదనపల్లె : పట్టణంలోని ఓ చేనేత కార్మికుడి ఇంట్లో చోరీ జరిగింది. దాదాపు రూ.3.5 లక్షల విలువైన బంగారం దోచుకెళ్లారు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు కే.మదన్‌మోహన్ రెడ్డి, తన భార్యతో కలిసి మగ్గం పనులకు వెళ్లారు. యథావిధిగా శుక్రవారం పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన ఆయన బీరువా గమనించగా నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. రోజూ పనులకు వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేసి తాళంచెవులు బాత్‌రూంలో ఉంచి వెళ్లే వారమని, ఇది ఎవరో గుర్తించి పనులకు వెళ్లిన సమయంలో చోరీకి పాల్పడ్డారని బాధితుడు తెలిపారు. 70 గ్రాముల బరువు గల బంగారు నగలు చోరీకి గురయ్యాయని, వాటి విలువ సుమారు రూ.3.5 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటసుబ్బయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యువరాజు తెలిపారు.



గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

కురబలకోట : కురబలకోట రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు(25) మృతి చెందారు. శనివారం స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. ఇతను ఎవరు..ఎక్కడి వారన్నది తెలియలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కదిరి రైల్వే పోలీసులు మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిస్తే 9133109537 నెంబర్‌కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు.

మదనపల్లె ఘటనలతో చంద్రప్పన్

- స్థానిక నటీనటులతో 50 రోజుల పాటు చిత్రీకరణ
- డైరెక్టర్ డాక్టర్.యశ్మన్



చంద్రప్పన్ సినిమా వివరాలు వెల్లడిస్తున్న డైరెక్టర్ డాక్టర్.యశ్మన్

మదనపల్లె : ఎలిగెంట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మదనపల్లె, పరిసర ప్రాంతాల్లో జరిగిన యథార్థ సంఘటలను ఇతివృత్తంగా తీసుకుని చంద్రప్పన్ సినిమా చిత్రీకరిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్.యశ్మన్ తెలిపారు. పట్టణంలోని సొసైటీకాలనీ దృష్టి కంటి ఆస్పత్రి సమీపంలోని ఎలిగెంట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆఫీస్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన సినిమా వివరాలు వెల్లడించారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణకు అనువైన స్థలాలున్నాయన్నారు. చంద్రప్పన్, రామ సముద్రవాసి క్యాప్షన్‌తో తీస్తున్న సినిమా మదనపల్లె పరిసర ప్రాంతాల ఘటనల నేపథ్యంతో కూడుకున్నదన్నారు. స్వీయ దర్శకత్వంలో సినిమా తీయడంతోపాటు, కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్, లిరిక్స్ తానే సమకూరుస్తున్నట్లు చెప్పారు. స్థానిక టాలెంట్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ నెల 15వ తేదీ నుంచి మదనపల్లె ఆఫీస్‌లో 10 రోజులపాటు ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నటీనటుల అడిషన్స్ జరుగుతాయన్నారు. సినిమాలోని అన్ని పాత్రలకు సంబంధించి, అన్ని వయస్సుల స్త్రీ,పురుష నటీనటుల ఎంపిక జరుగుతుందన్నారు. జూలైలో తొలి షెడ్యూల్‌ను మదనపల్లె, రామ సముద్రం, సీటీఎం, అంగళ్లు, కురబలకోట, హార్సిలీ హిల్స్ ప్రాంతాల్లో 10 నుంచి 15 రోజుల పాటు చిత్రీకరిస్తామన్నారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో 45–50 రోజుల పాటు ఏకధాటిగా షూటింగ్ నిర్వహించి, సినిమా పూర్తిచేస్తామన్నారు. ఎలిగెంట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ క్రౌడ్ ఫండింగ్‌తో సినిమా నిర్మాణ సంస్థగా ప్రజల ముందుకు వస్తోందని తెలిపారు.

కూలీ డబ్బుల కోసం ఘర్షణ

– బాలుడికి తీవ్ర గాయాలు



ఘర్షణలో నడుము విరిగి తీవ్రంగా గాయపడిన బాలుడు ప్రశాంత్

మదనపల్లె : కూలీ డబ్బుల కోసం జరిగిన ఘర్షణలో బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తపల్లె పంచాయతీ వడ్డేపల్లికి చెందిన వెంకట రమణ భార్య ఉప్పుతోళ్ల శోభ, తన పక్కింటికి చెందిన వెంకటమ్మను భవన నిర్మాణ పనులకు తీసుకొని వెళ్లారు. వారం రోజుల తర్వాత మేస్త్రి కూలీ డబ్బులు ఇవ్వకపోవడంతో, శనివారం శోభతో వెంకటమ్మ తన కూలి డబ్బులివ్వాలంటూ గొడవ పడింది. ఈ క్రమంలో వెంకటమ్మ, తన కుమారులు సురేష్, నరేష్ తో కలిసి శోభపై దాడి చేశారు. తల్లిని కొడుతుండగా అడ్డుకున్న శోభ కుమారుడు ప్రశాంత్ (11)ను వెంకటమ్మ కుమారులు సురేష్, నరేష్ పైకెత్తి కింద పడవేయడంతో నడుము విరిగి బాలుడు గాయపడ్డాడు. వెంటనే బాలుడి కుటుంబ సభ్యులు మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాలుడు తల్లి శోభ ఫిర్యాదు మేరకు నిందితులైన వెంకటమ్మ, సురేష్, నరేష్‌లపై కేసు నమోదు చేసి ఎస్సై వెంకటేష్ విచారిస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

ఇంట్లో అగ్ని ప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలి పోయిన ఫ్రిడ్జ్, వస్తువులు

మదనపల్లె : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిందని ఫైర్ ఆఫీసర్ శివప్ప తెలిపారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రశాంత్‌నగర్ 11వ క్రాస్‌లోని ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందగా, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆర్పే ప్రయత్నం చేశామన్నారు. అప్పటికే వంటింట్లోని ఫ్రిడ్జ్ కాలిపోవడమేగాక, సమీపంలోని వస్తువులన్నీ కాలిపోయాయన్నారు. ప్రమాదంలో సుమారు లక్ష విలువ చేసే వస్తువులు కాలిపోయాయని బాధితురాలు ప్రమీల తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలి బూడిదైన ఇంటిలోని సామగ్రి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దిన్నెపాడు గ్రామం బెస్తపల్లి హరిజనవాడకు చెందిన మద్దిరేవుల ఓబులేసు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం రాత్రి పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు, స్థానికుల వివరాల మేరకు.. శనివారం రాత్రి ఓబులేసు ఇంటిలోని బెడ్ రూమ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా సిబ్బంది చేరుకునేలోపే నష్టం జరిగిపోయింది. దాదాపు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు ఓబులేసు విలపించారు. ఇంట్లో నిల్వ ఉంచిన వేరుశనగ విత్తన కాయలతోపాటు బంగారు నగలు, నగదు, ఇతర సామగ్రి కాలిపోయినట్లు బాధుతుడు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేసి తనకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకున్నారు.


భక్తి శ్రద్ధలతో మృత్యుంజయ హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక అగస్త్యేశ్వరాలయంలో శనివారం మృత్యుంజయ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీ అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన జరిపి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవత, మృత్యుంజయ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడి మృతి



ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి శనివారం మృతిచెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని లింగాపురం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి కుడి చేతిపై ఓం అనే పచ్చబొట్టు ఉందని, పసుపు రంగు ఫుల్ కాటన్ షర్ట్, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు రూరల్ ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఆరడుగులు.. ఆమడదూరం

- శ్మశాన వాటిక స్థలాల ఆక్రమణ
- అంత్యక్రియలకు బంధువుల అవస్థలు
- కొండల మధ్య పూడ్చివేస్తున్న వైనం

ఆ గ్రామంలో ఎవరైనా మరణిస్తే.. ఆ వ్యక్తి మరణించిన దుఃఖం కంటే అంత్యక్రియలు ఎలా చేయాలనేదే ఆత్మీయులను ఎక్కువగా బాధిస్తుంది. శ్మశాన వాటిక లేకపోవడంతో కొండల్లో రాళ్ల మధ్య స్థలాన్ని శ్మశాన వాటికగా వినియోగిస్తున్నారు. గ్రామంలో శ్మశాన వాటిక కబ్జాకు గురైనా.. మకొన్ని చోట్ల స్థలాలు చూపండనే ప్రజల విన్నపం ఆచరణ కాలేదు.



కొండ రాళ్ల మధ్య మృత దేశాలు పూడ్చుకునే శ్మశాన స్థలం



మృతదేహాలు పూడ్చేందుకు వెళ్లే దారి దుస్థితి

ఎర్రగుంట్ల : పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పదు.. మరణించిన వారి అంతిమ సంస్కారాలకు ఆరడుగుల స్థలం అవసరం. శ్మశాన వాటిక ఏర్పాటుపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. ఎర్రగుంట్ల మండలం చిన్నదండ్లూరు పంచాయతీ పరిధిలోని మేకలబాలయపల్లె గ్రామంలో సుమారు 200 కుటుంబాలున్నాయి. ఇక్కడ శ్మశాన వాటిక లేదు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం, వృద్ధాప్యం వల్ల చనిపోతే మృత దేహాలను ఎక్కడ పూడ్చుకోవాలోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామం సమీపంలో డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీకి అతి సమీపంలో ఉంది. ఫ్లైయాస్ దుమ్మును భరిస్తూ ప్రజలు అవస్థ పడుతున్నా గ్రామాభివృద్ధికి ఆర్టీపీపీ సంస్థ పెద్దగా శ్రద్ధ చూపలేదని తెలుస్తోంది.

గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశాన వాటిక లేకపోవడంతో మృత దేహాలను కాలువ వెంబడి తీసుకోని పోయి కంపచెట్లు, కొండ రాళ్ల మధ్య పూడ్చుకోవాల్సిందే. మృతదేహం ఉంటే గ్రామ ప్రజల గుండెల్లో గుబులు పుడుతోంది. ఆర్టీపీపీ ఉద్యోగులు నివసిస్తున్న వీవీరెడ్డి కాలనీ వాసులకు రెవెన్యూ అధికారులు శ్మశాన వాటిక స్థలం చూపారేగానీ, ఏళ్ల నుంచి ఉన్న మేకలబాలయపల్లె గ్రామానికి మాత్రం స్థలం లేకుండాపోయింది.

ఇష్టారాజ్యంగా స్థలాల అక్రమణ

గ్రామానికి సమీపంలో మైలవరం కాల్వ సమీపంలోని కొండ ప్రాంతంలో మృత దేహాలను పూడ్చుకుంటూ వస్తున్నారు. ఈ మార్గంలో వెళ్లేందుకు దారి లేకున్నా.. అతి కష్టంపై గ్రామస్తులు తీసుకెళ్లి అంత్యక్రియలు చేస్తున్నారు. అయితే ఆ స్థలాన్ని కొందరు కబ్జా దారులు వదలడం లేదు. యథేచ్ఛగా ఆక్రమించి స్థలం చుట్టూ కంచె వేసి పంటలు సాగు చేస్తున్నారు. దీంతో మృత దేహాలను పూడ్చుకునే శ్మశాన వాటిక కనుమరుగైంది. గ్రామంలోని చోటా నాయకులు స్వలాభం కోసమే నాయకుల వద్దకు పోతున్నారేగానీ గ్రామానికి శ్మశాన వాటిక స్థలం కావాలని పట్టు బట్టడం లేదు. అధికారులు స్పందించి మేకలబాలయపల్లెకు శ్మశాన స్థలం చూపించి అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.